# పాశం

శ్రుతి మనసు భగభగమండుతోంది. పదిమందిలో ఏమన్నా బావుండదని ఊరుకుంది గాని లేకుంటే అప్పుడే మగడి చర్యను కడిగేసేది. లేకపోతే దారి మధ్యలో తనని వదిలేసి. పెద్ద ప్రజాసేవకుడిలా పరోపకారం కోసం నడుం బిగించడమేంటి? అవతల వ్యక్తి తనకేమైనా బంధువా? బంధం అనుకుని వ్రేలాట్టానికి. ఇంటికిరానీ చెబుతా. . . కోపంలో అలా ఎన్నిసార్లు అనుకుందో ఆమెకే తెలీదు. ఎంత వద్దను కుంటున్నా ఆ దృశ్యం కళ్ళతో అడుకుంటూనే వుంది.

★ ★ ★

"ఇవాళ మా ఫ్రెండ్ సౌజన్య ఇంటికి వెళ్ళాలండి" టీపాయి మీద టీ కప్పు ఉంచుతూ గోముగా అంది శ్రుతి.

పేపరు చూస్తున్న సంజయ్ మాట్లాడలేదు. "మొన్న షాపింగుకు వెళ్ళినపుడు కూడా సౌజన్య కనిపించి వాళ్ళింటి కి రమ్మని మరీ మరీ చెప్పింది" అంది మళ్ళీ.

సంజయ్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతడు శ్రుతి మెళ్ళో తాళి కట్టాడనేకంటే ఉద్యోగానికి పుస్తె కట్టాడంటేనే బావుంటుందేమో! క్షణం తీరికుండదు. ఎప్పుడు చూసినా క్యాంపులు, టూర్లూ. అవేళ ఏ ఊరు పడిందో ఇంట్లోనే ఉన్నాడు. అందుకే ఆ అవకాశాన్ని జారవిడవదలచుకోలేదు శ్రుతి.

భార్య మాట కొట్టిపారేయలేక సరేనన్నాడు సంజయ్.

శ్రుతి మోము పూర్ణచంద్రబింబమై పోయింది. "ఉండండి ఒక్క క్షణం" అంటూనే గంటసేపు ముస్తా బైంది. బాక్సర్ బయటకు తీసాడు సంజయ్.



అంతవరకు బాగానే వుంది. ఆ తర్వాత జరిగిందాని గురించే చెప్పుకోవాలి.

రోడ్డుమీద జనం గుమిగూడి ఉండటం చూసి మోటారు సైకిలు అపాడు సంజయ్.

"అనాథ ప్రేతకి అంత్య క్రియలు జరిపించాలను కుంటు న్నాం మీకు తోచిన సహాయం..." అంటూ పళ్ళెం పట్టాడో వ్యక్తి.

సంజయ్ దృష్టి మృత దేహం మీద పడింది. అతడి గుండె గుభి ల్లుమంది. 'ఆయన గంగాధరంగారు'! ఈ లోకంతో నాకింకేమీ సంబంధం లేదన్నట్లు ప్రశాంతంగా నిద్రపోతున్నారు. అతడి చుట్టూ రూపాయి బిళ్ళలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.

"ఇతను. . . ఇక్కడ. . ." మాటలు తడబడుతున్నాయి సంజయ్‌కి.

"గుండెపోటుతో బాధపడుతున్నాడు. . . ఎవరైనా ఇతణ్ణి గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్పించండి" అంటూ కండక్టరు ఈయన్ని ఇక్కడ దింపేసాడు.

మానవతా దృక్పథంతో మేం డాక్టరు వద్దకు తీసుకెళదామని అనుకుంటూ వుండగానే శ్వాస ఆగిపోయింది" అన్నాడు ఆ ఆసామి.

"మీరెవర్నీ డబ్బులు అడగొద్దు ఇతనికి అంత్యక్రియలు నేను జరిపిస్తాను. కావలసిన ఏర్పాట్లుచూడండి" అన్నాడు సంజయ్.

ఆ మాటతో తలొకరు తలో దిక్కుకు పరుగెత్తారు.

"నువ్వు ఇంటికెళ్ళు. నేనీ కార్యక్రమం పూర్తి చేసివస్తాను" అంటూ శృతి కోసం ఆటో కేకేసాడు.

భర్త చర్య తనకు నచ్చుకున్నా పదిమందిలో ఏమీ అనలేక మౌనంగా ఆటో ఎక్కింది.

★ ★ ★

తడి గుడ్డలతో నీళ్ళు కారుకుంటూ లోపలకొచ్చాడు సంజయ్.

ఉక్రోషంతో ఉవ్వెత్తున లేచింది శృతి.

అయితే అన్నిటికి చిరునవ్వే సమాధానం లభించడంతో చప్పబడిపోయింది.

"ఓ అభాగ్యుడికి అంత్యక్రియలు జరిపించడం కోసం కట్టుకున్న భార్యని మార్గమధ్యలో వదలేసిపోవడం మీకు భావ్యంగా ఉందా?" అన్నట్లు నిస్సహాయంగా కళ్ళనీరు నింపుకుంది.

"చూడు శృతీ, నేను చేసిన పని నీకు అపసవ్యంగా ఉన్నట్లనిపించవచ్చు. చూస్తూ చూస్తూ అందరి మాదిరిగానే నేనూ వెళిపోతే ఆ తర్వాత జీవితాంతం ఎంతో మదనపడవలసి వచ్చేది. . ."

పెనిమిటి మాటలేవీ ఆమె చెవికెక్కడం లేదు.

అయినా చెప్పుకుపోతున్నాడు సంజయ్.

★ ★ ★

"రేయ్, ఇవాళ మీరెవరేం కొట్టుకొచ్చారో ఇలా పెట్టండి"

బాస్ గర్జనకు బెదిరిపోయాడు రాము. గొంతు విడకపోవడంతో గుటకలు మింగుతున్నాడు.

ఆరోజు వాడేమీ పట్టుకురాలేదని అర్ధమైపోయింది జోగిందర్‌కి. కోపం అణచుకోలేక చంకనున్న ఊత కర్ర ఎత్తి వాడి బుర్ర ఠపీమనిపించాడు.

ఆ దెబ్బతో కిరకిర చుట్టుకుంటూ క్రింద పడ్డాడు రాము.

బాస్ చర్యలకు బెంబేలెత్తిపోయిన పసివాళ్ళంతా అడక్కుండానే తాము దొంగిలించిన సొత్తును అతడి ముందుంచారు.

పర్సులు, రిష్టువాచీలు, పెన్నులు, హ్యాండ్ బేగులు. . .

వాటిని చూడటంతోనే అతడి ఆగ్రహం అణగారిపోయింది.

జోగిందరీ పుట్టుకతో అవిటివాడు. ఉన్న ఊళ్ళో పూట గడవకపోవడంతో బ్రతుకుతెరువుకోసం స్వరాష్ట్రం విడిచి వచ్చాడు. పసివాళ్లని ఎత్తుకుపోవడం కొంత వయసు వచ్చేంతవరకు పెంచి పోషించి ఆపైన వాళ్ళ చేత దొంగతనాలు చేయించడం అతడి వృత్తి.

"అనాథ దార్లోకొచ్చాడా?" అడిగాడు జోగిందర్ పిల్లలు పట్టుకొచ్చిన వసువుల్ని పరిశీలిస్తూ.

"ఆడు దొంగతనం చేయడంట" అన్నాడు ఆలి.

"నాలుగు తగలనీయకపోయావా?"

"మీరు తన్నిన తన్నులకి సగం చచ్చాడు. నేను కూడా బాదితే గుడ్లు తేలేయడం ఖాయం.

"వర్థి మొండివెధవ. వాడి మంకుపట్టు వాడిదే తప్పు మన మాట ఇనిపించుకోడు"

"ఆడిని బయటకు గెంటేయడం బెటర్ బాస్. ఇంకా కూర్చోబెట్టి మేపడం శుద్ద దండగ"

"మరెందుకాలశ్యం? ఆ పనేదో వెంటనే చెయ్యి.

అలా వీధిన పడ్డ అనాథ చదూకోవాలనుకున్నాడు. ఆ కోరికతోనే ఓ ఎలిమెంటరీ స్కూలుకెళ్ళాడు.

బడికి అప్పుడే విరామం ఇచ్చినట్లుంది. పిల్లలు అటు ఇటు తచ్చాడుతున్నారు. ఉపాధ్యాయులు ఆరుబయట నిలబడి పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.

ఎవరు నువ్వన్నట్లు అతడి వంక యగాదిగా చూసారు సత్యం మాష్టారు.

"నేను అనాథను" అన్నాడు పిల్లవాడు.

"అనాథవైతే అడుక్కోకుండా ఇక్కడెందుకు తగలడ్డావ్‌రా" ఎగతాళి చేసాడు అటెండరు ఆదిబాబు.

"చదూకుంటాను" మనసులో మాట బయటపెట్టాడు అనాథ.

వాడిని చూస్తే జాలేసింది సత్యం మాష్టారికి.

"స్కూల్లో ఎడ్మిట్ అవ్వాలనుకుంటే మీ నాన్నను తీసుకురా" అన్నారు సానుభూతిగా. మాష్టారి మాటకు మొహం అదోలా పెట్టి "నాకు నాన్న లేడు" అన్నాడు అనాథ. "చనిపోయాడా?" అడిగాడు సత్యం మాష్టారు.

"నాకసలు నాన్నే లేడు"

"నాన్న లేకుండా నువ్వెలా పుట్టావురా?" అన్నాడు ఆదిబాబు పగలబడి నవ్వుతూ.

"ఆదిబాబు అతివాగుడు"కి చిరాకేసింది సత్యం మాష్టారికి.

"అది సరే, నీకు అన్నం ఎవడు పెడుతున్నారు?" అనిఅడిగారు కృష్ణ మాష్టారు.

"ఇవాల్టిదాకా బాస్ పెట్టాడు. నేను దొంగతనం చెయ్యనన్నానని బయటకు పంపేసాడు" ఏడుస్తూ అన్నాడు అనాథ.

ఆమాటతో టీచర్లందరికీ వాడి పరిస్థితి అర్థమైపోయింది.

"చూడు బాబు చదువుమీద నీకున్న శ్రద్ధ చూస్తూ ఉంటే మాకు ముచ్చటేస్తోంది. అయినా మేమేం చెయ్యిలేం. పేరెంట్‌ని తీసుకురాకపోతే నిన్ను ఎవరూ ఏ బడిలోను వేస్కోరు. మా మాట విని మీ నాన్న ఎవరో మీ బాస్‌ని కనుక్కో" అన్నారు అనునయంగా సత్యం మాష్టారు.

"అమ్మో మళ్ళీ బాస్ దగ్గరకెళితే చంపేస్తాడు" భయంతో గజగజ వణికిపోతూ అన్నాడు అనాధ.

"పోనీ ఓ పని చెయ్యి. నీకు నచ్చినవాడిని మా నాన్న అని చెప్పి తీసుకురా" వెటకారమాడాడు ఆది.

వాడి మాటకు వళ్ళు మండినా ఎవరూ నోరెత్తలేదు.

ఆదిబాబు సలహా పాటించాలనుకున్నాడో ఏమో పాపం ఓ ఇంటిముందు నిలబడి 'నాన్నా' అని పిలిచాడు అనాధ.

వాడి పిలుపుకు ఇంటి యజమాని బయటకొచ్చి ఒక రూపాయి ధర్మం చేయబోతే "నాకు డబ్బు లొద్దు. మీరు మా నాన్న అని చెప్పండి. నన్నుబడిలో వేసుకుంటారు" అమాయకంగా అన్నాడు అనాధ.

"ఏరా పిచ్చగా ఉందా ఏం" చీదరించుకుంటూ లోనికెళ్ళిపోయాడు ఇంటి యజమాని. అనాధకు ఏం చేయాలో పాలుపోకపో వడంతో ఏడుపొచ్చింది.

బడినుండి వస్తున్న పిల్లల్ని చూసాడు. వాళ్లంతా చదూకుంటున్నారంటే వాళ్ళందరికీ నాన్న ఉన్నాడన్న మాట మరి నాకెందుకు లేడు అనుకున్నాడు లోలోపల

ఆ పసివాడి సందేహానికి సమాధానం చెప్పేవారెవరూ లేరక్కడ.

అనాధ అవస్థను కళ్ళారా గమనించిన గంగాధరం గారి మనసు ఆర్ద్రమైంది. చదూమీద వాడికున్న ఆస క్తిని చూసి చలించిపోయారు. వెంటనే వాడికి అన్నం పెట్టి, మంచి బట్టలు తొడిగించి బడిలో వేయించారు. తిండికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ నడుపుతున్న సత్రవలో సీటు ఇప్పించారు.

★ ★ ★

సంజయ్ చెప్పిందంతా విన్న శృతి "ఎందుకండి కాకమ్మ కథలు చెబుతారు? నేను అడిగిందానికి మీరు చెబుతున్నదానికి పొంతన ఉందా?" అందిచిరాగ్గా.

"నువ్వు కాకమ్మ కథ అంటూ కొట్టిపారేసిన కథ లోని అనాధను నేనే" అన్నాడు సంజయ్.

నమ్మలేనన్నట్లు ఆశ్చర్యంగా చూసింది శృతి. "నువ్వు నమ్మినా నమ్మకున్నా ఇది యదార్థం. కన్న వాళ్ళే కనికరం లేకుండా వదిలేసి నన్ను అనాధను చేసారు. ఏ సంబంధం లేకున్నా ఈ అనామకుడికి తండ్రినని చెప్పి బడిలో వేసి నా ఉజ్వల భవిష్యత్తుకు ఊపిరిపోసారు గంగాధరంగారు. ఆయన చేసిన పని ఈ లోకంలో ఎవ్వరూ చేయలేనిది. అటువంటి మహ నీయుణ్ణే నేనీ రోజు అంతిమయాత్రకు సాగనం పాను."

సంజయ్ మాటలకు శృతి మనసు కలుక్కుమంది.

కాస్సేపు ఆమె నోరు విడలేదు. తర్వాత తేరుకుని "మీ అనుబంధం తెలుసుకోకుండా తొందరపడి మిమ్మల్ని అవమానించాను. నన్ను మన్నించండి" అంటూ భర్త గుండెల మీద వాలిపోయింది.

"నువ్వే కాదు నీ స్థానంలో ఎవరున్నా అలాగే ప్రవర్తిస్తారు. బాధపడకు" ఊరడింపుగా అన్నాడు సంజయ్ ఆప్యాయంగా ఆమె తల నిమురుతూ. "నాకు తెలియక అడుగుతాను. ఈమధ్యకాలంలో మీరెన్నడూ ఆయన్ని కలవనే లేదా?" సందేహం వ్యక్తం చేసింది శృతి.

భార్య ప్రశ్నకు విరక్తిగా నవ్వుతూ "కలవడానికి ఆయన ఎక్కడున్నాడో తెలుస్తేనా? బడిలో చదూకునేటప్పు తరచూ వాళింటికెళ్ళేవాడిని. వెళ్లినప్పుడల్లా "బాగా చదూతున్నావా బాబూ" అంటూ నన్ను దగ్గరకు తీసుకునేవారు. అప్పుడే ఓ నిప్పులాంటి నిజం బయటపడింది. పుణ్యం కోసం దైవదర్శనానికి బయలుదేరితే యాత్రాస్థలంలో తన రెండేళ్ళ కొడుకుని ఎవరో అపహరించుకుపోయారని బాధపడుతూ చెప్పారు.

లేకలేక కలిగిన నలుసు మాయమవడంతో ఆ వ్యధను తట్టుకోలేక అతని భార్య మరణించిందట. తనకు 'నా' అన్నవాళ్ళెవరూ లేకపోవడంతో నాలో అతను తన బిడ్డను చూసుకుంటున్నానన్నారు. నేను హైస్కూల్లో అడుగుపెట్టిన తర్వాత మరి ఆయన నాకు కనిపించలేదు. ఎక్కడికి వెళ్ళిపోయారో ఏమో! మళ్ళీ ఇదుగో ఇప్పుడిలా" అంటూ కళ్ళు వత్తుకున్నాడు సంజయ్.

మగడి ఔన్నత్యాన్ని తిలకిస్తున్న శృతి నోట మరిమాట రాలేదు.

నిజానికి సంజయే తన బిడ్డని గంగాధరంగారికి కాని, ఆయనే తన కన్నతండ్రి అని సంజయ్‌కి గాని తెలీదు. తెలిసే అవకాశమూ లేదు. ఎందుకంటే దానికి రుజువు లేదు. అయినా సరే. కన్నబిడ్డ చేతే ఆ తండ్రికి తలకొరివి పెట్టించింది పాశం.

(5-3-2005 ఆంధ్రభూమిడైలి)